క్లుప్తంగా

సీఎంకు కృతజ్ఞతలు



సీఎంకు కృతజ్ఞతలు తెలుపుతున్న టీఆర్ఆర్

పరిగి: రెండో విడత రూ.1.5లక్షల రుణమాఫీ చేయడంతో ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి కృతజ్ఞతలు తెలిపారు. దేశంలో ఏ రాష్ట్రంలో కాని విధంగా ఏకకాలంలో రూ.31వేల కోట్ల రూపాయల మాఫీ చేసింది కేవలం కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రమేనని అన్నారు. కాంగ్రెస్ రైతులకు, ప్రజలకు ఇచ్చిన హామీలన్నిటిని నెరవేస్తుందన్నారు.

బ్యాంకుల వద్ద పడిగాపులు

కొడంగల్ : రైతు రుణాలను ప్రభుత్వం రెండు విడతలో మంగళవారం రూ.లక్షన్నర లోపు మాఫీ చేసింది. రైతుల ఖాతాల్లో డబ్బులు వేశారు. దీంతో మండలంలోని పలు గ్రామాల రైతులు కొడంగల్‌లోని బ్యాంకుల వద్ద రుణ ఖాతాలను రెన్యూవల్ చేసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో ఏపీజీవీబీ, యూనియన్ బ్యాంకుల వద్ద రైతులు బారులు తీరారు. ఖాతాలను రెన్యూవల్ చేసుకోడానికి పడిగాపులు కాస్తున్నారు. తిరిగి పంట రుణాలు తీసుకోవడానికి బ్యాంకుల చుట్టూ తిరుగుతున్నారు. బ్యాంకు అధికారులు సరిగ్గా స్పందించక పోవడంతో రెగ్యులర్ ఖాతాదారులు ఇబ్బంది పడ్డారు.
పౌరహక్కులకు భంగం కలిగించొద్దు

తహసీల్దార్‌కు సన్మానం



తహసీల్దార్‌ను సత్కరిస్తున్న అనిల్

బంట్వారం: నూతనంగా బాధ్యతలు స్వీకరించిన కోట్‌పల్లి తహసీల్దార్ మహేశ్‌కుమార్‌ను బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సుందరి అనిల్ మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసి శాలువా, పూలమాలతో సత్కరించారు. అనంతరం మహేశ్‌కుమార్ మాట్లాడుతూ.. రెవెన్యూ సమస్యల పరిష్కారం కోసం శక్తి వంచన లేకుండా పని చేస్తానని మండల ప్రజలు, నాయకులు సహకరించాల్సిందిగా కోరారు. కార్యక్రమంలో సర్పంచుల సంఘం మాజీ మండల అధ్యక్షుడు వెంకటేశ్‌యాదవ్, ఎంఎసీ మాజీ చైర్మన్ మహేందర్, ఎంఎసీ మాజీ వైస్ చైర్మన్ మహబూబ్ పాల్గొన్నారు.

కార్మికుల సేవలు వెలకట్టలేనివి



కార్మికులకు వస్తువులు అందజేస్తున్న అశోక్ తదితరులు

పరిగి: పారిశుద్ధ్య కార్మికుల సేవలు వెలకట్టలేనివని మున్సిపల్ చైర్మన్ ముకుంద అశోక్ అన్నారు. మంగళవారం కమిషనర్ వెంకటయ్య ఆధ్వర్యంలో కార్మికులకు సబ్బులు, నూనెలు, చెప్పులు తదితర వస్తువులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఇబ్బందికర పరిస్థితుల్లో కూడా విధులు నిర్వహిస్తున్న కార్మికులకు అండగా ఉంటామన్నారు. వారి సేవలకు విలువకట్టలేమని పేర్కొన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్స్ వెంకటేశ్, రవీంద్ర, కృష్ణ, నాగేశ్వర్, శ్రీనివాస్, మునీర్, రియాజ్, రవికుమార్, మల్లేష్ యాదవ్, కోఆప్షన్ సభ్యులు శేఖర్, సానియా సుల్తానా అన్వర్, ముజామిల్, పురపాలక సంఘ మేనేజర్ నరేష్‌కుమార్ పాల్గొన్నారు.

పర్యావరణాన్ని కాపాడుదాం



మొక్కలు నాటుతున్న మంజుల

అనంతగిరి: మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడుదామని వికారాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ మంజుల రమేష్‌కుమార్ పేర్కొన్నారు. వన మహోత్సవంలో భాగంగా మంగళవారం పలు చోట్ల మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. నాటిన ప్రతి మొక్కను సంరక్షించాలన్నారు. ప్రభుత్వం ఇచ్చిన నిర్దేశించినల లక్ష్యాన్ని పూర్త చేద్దామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జాకీర్ అహ్మద్, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ రమేష్‌కుమార్, కౌన్సిలర్ చందర్ నాయక్, గాయత్రి, స్వాతిరాజ్‌కుమార్, శ్రీదేవి సదానంద్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

సీఎం రేవంత్‌రెడ్డి రైతు పక్షపాతి

- హామీని నెరవేర్చిన కాంగ్రెస్ ప్రభుత్వం
- ఆనందంలో అన్నదాతలు
- సీఎంకు కృతజ్ఞతలు తెలిపిన రైతులు, నేతలు



ధారూరు: సీఎం సందేశాన్ని వింటున్న రైతులు



పూడూరు: వీడియో కాన్ఫరెన్స్‌లో రైతులు



దుద్యాల్ : చెక్కు అందుకుంటున్న చంద్రప్ప

దౌల్తాబాద్: కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఇచ్చిన మాటకు కట్టుబడి ఉందని జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు వెంకట్రావు అన్నారు. మంగళవారం వారు మాట్లాడుతూ.. ఆగస్టు 15లోపు రైతులకు రుణమాఫీ చేస్తామన్న ప్రభుత్వం జూలై లోపే రూ.లక్షన్నర రుణమాఫీ చేసిందన్నారు. గతవారం రోజుల క్రితం రూ.లక్షమాఫీ చేయగా ప్రస్తుతం రెండోవిడత పూర్తి చేసినట్లు పేర్కొన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి రైతు పక్షపాతి అన్నారు.

రుణమాఫీపై మాట్లాడిన సీఎం

ధారూరు: మండల కేంద్రంలోని రైతు వేదికలో మంగళవారం ఏర్పాటు చేసిన వీడియో కాన్ఫరెన్స్‌లో సీఎం రేవంత్‌రెడ్డి రైతులతో మాట్లాడారు. రుణమాఫీ డబ్బులు ఎవరికైన పడకుంటే వారికి అవగాహన కల్పించి మాఫీ రాకపోవడానికి కారణం చెబుతూ ఎలా జమ అవుతాయో నివృత్తి చేయాలని సీఎం అధికారులకు సూచించడంపై హర్షం వ్యక్తమైంది. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి ఝాన్సీలక్ష్మి, ఏఈఓ సంజూరాథోడ్, నాయకులు మహ్మద్ బాబాకాన్, రైతులు పాల్గొన్నారు.

రైతుకు రుణమాఫీ చెక్కు అందజేత

దుద్యాల్ : రెండో విడత రుణమాఫీ రూ.లక్ష 50 వేలకు సంబంధించిన నిధులను ప్రభుత్వం మంగళవారం విడుదల చేసింది. మండలంలో 1775 మంది రైతులకు రూ.18కోట్ల 33 లక్షలతో మాఫీ జరిగిందని వ్యవసాయ శాఖ ఏఓ అనురాధ తెలిపారు. ఇందులో భాగంగా కలెక్టర్ కార్యాలయంలో మండలానికి చెందిన రైతు చాకలి చంద్రప్పకు కలెక్టర్ ప్రతీక్ జైన్ రూ.1,27,850 మాఫీ చెక్కు అందజేశారు. దీంతో రైతు సంతోషం వ్యక్తం చేశారు.

రూ.14.09 కోట్లు రైతుల ఖాతాల్లో జమ

ధారూరు: మండలంలోని 32 గ్రామ పంచాయతీల పరిధిలోని 1,388 మంది రైతుల ఖాతాల్లో మంగళవారం రెండో విడత రుణమాఫీ రూ. 14.09 కోట్ల నిధులు జమ అయ్యాయని మండల వ్యవసాయ అధికారి ఝాన్సీలక్ష్మి పేర్కొన్నారు. ఈ నెల 17న 2,766 మంది రైతుల ఖాతాల్లో రూ. లక్ష రుణమాఫీ రూ.15.97 కోట్లు రైతుల అకౌంట్లలో జమ అయ్యాయని తెలిపారు. బ్యాంకులు రైతులు తీసుకున్న రుణంలో జమ చేయరాదని, అలాంటి ప్రయత్నం చేస్తే ఆయా బ్యాంకుల మేనేజర్లపై చర్యలకు ఉన్నతాధికారుల ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు. సీఎం ఆదేశాల మేరకు బ్యాంకులకు వచ్చిన డబ్బులను రైతుల ఖాతాల్లో జమ చేయాల్సి ఉంటుందని, రైతు ఒప్పుకుంటేనే వారి రుణఖాతాలో జమ చేయాలని ఆమె సూచించారు.

రైతులకు భరోసా

బొంరాస్‌పేట: రెండో విడత రైతు రుణమాఫీలో భాగంగా మంగళవారం జిల్లా కలెక్టర్, పీఏసీఎస్ చైర్మన్ జయకృష్ణ, మండల పార్టీ నాయకుల ఆధ్వర్యంలో పలువురు రైతులకు చెక్కులు అందజేశారు. కార్యక్రమానికి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నర్సింలుగౌడ్, మల్లేశ్, తదితరులున్నారు.

పెద్దేముల్‌లో రూ.24.66 కోట్లు

పెద్దేముల్: మండలంలో 3,454 మంది రైతులకు రూ.24.66 కోట్ల రుణమాఫీ జరిగిందని కోట్‌పల్లి వ్యవసాయ మార్కెట్ వైస్ చైర్మన్ నారాయణరెడ్డి అన్నారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ,సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం రుణమాఫీ చేసి రైతుల ముఖాల్లో ఆనందం నింపారని అన్నారు. గత 40 ఏళ్ల నుంచి కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మాట నిలబెట్టుకోవడం జరుగుతుందన్నారు. రైతుల తరపున ముఖ్యమంత్రి, స్పీకర్ ప్రసాద్‌కుమార్, ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డిలకు కోటపల్లి వ్యవసాయ మార్కెట్ వైస్ చైర్మన్ నారాయణరెడ్డి ధన్యవాదాలు తెలిపారు.

హామీని నిలబెట్టుకున్న కాంగ్రెస్

పూడూరు: కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో వెనుకడుగు వేయదని డీసీసీ ప్రధాన కార్యదర్శి సోమన్‌గుర్తి శ్రీనివాస్ అన్నారు. మంగళవారం రెండో విడత రుణమాఫీ నిధుల విడుదల కార్యక్రమాన్ని స్థానిక రైతులతో కలిసి రైతు వేదికలో సీఎం వీడియో కాన్ఫరెన్సులో మాట్లాడారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మాటకు కట్టుబడి ఉందన్నారు. గత బీఆర్ఎస్ పదేళ్ల పాలనతో రుణమాఫీ కాలేదని విమర్శించారు. ప్రస్తుతం లక్షాయాభై వేలు రైతుల ఖాతాల్లో జమయ్యాయని చెప్పారు. ఆగస్టు నెలాఖరు వరకు 2లక్షల రుణమాఫీ అవుతుందని తెలిపారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు సురేందర్, జిల్లా కార్యదర్శులు అజీంపటేల్, నాయకులు తాజోద్దీన్, నరేష్, శ్రీశైలం, లింగప్ప, నవీన్, శేఖర్ పాల్గొన్నారు.

రైతుల సంక్షేమమే ధ్యేయం

దోమ : రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని మండల వ్యవసాయ అధికారి ప్రభాకర్‌రావు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో ఏర్పాటు చేసిన వీడియో కాన్ఫరెన్స్‌లో సీఎం రేవంత్‌రెడ్డి రైతులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ప్రభాకర్‌రావు మాట్లాడుతూ.. రెండో విడత కింద మండలానికి రూ. 14 కోట్లు రుణమాఫీ అయ్యాయని తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి కావ్య, నేతలు రాఘవేందర్‌రెడ్డి, రాములు, రైతులు పాల్గొన్నారు.

ఆనందంలో అన్నదాతలు

కుల్కచర్ల: ఇచ్చిన హామీని కాంగ్రెస్ పార్టీ నిలబెట్టుకుందని డీసీసీ ఉపాధ్యక్షుడు భీంరెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు ఆంజనేయులు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని రైతువేదికలో నాయకులు, రైతులు సంబురాలు జరుపుకొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నాడు 10సంవత్సరాలలో చేసిన లక్ష రూపాయల రుణమాఫీ ఏ ఒక్క రైతుకు లబ్ధిచేకూరని పరిస్థితి నెలకొందన్నారు. నేడు రూ. 2లక్షల రుణమాఫీ కళ్లు కట్టినట్లుగా కనిపిస్తున్నదని చెప్పారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి వీరస్వామి, ఏఈఓలు బాబు, వంశీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పరిశుభ్రతపై ప్రత్యేక శ్రద్ధ



పరిసరాలను పరిశీలిస్తున్న ఎంపీడీఓ

కుల్కచర్ల: పరిసరాల పరిశుభ్రతపై ప్రతి ఒక్కరూ ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఎంపీడీఓ రామకృష్ణ అన్నారు. మంగళవారం మండలంలోని అల్లాపూర్ గ్రామపంచాయతీ పరిధిలో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ.. ప్రస్తుతం వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రజలు వ్యక్తిగత బాధ్యతగా ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఆరోగ్యంపై ముందస్తు జాగ్రత్తలు పాటించాలని చెప్పారు. కార్యక్రమంలో కార్యదర్శి మైమూన బేగం, ఆశ కార్యకర్తలు, అంగన్‌వాడీ లు పాల్గొన్నారు.

పౌర హక్కులకు భంగం కలిగించొద్దు

ఎస్సై ఎండీ రవూఫ్



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు

బొంరాస్‌పేట: పౌరహక్కులకు భంగం కలిగిస్తే చర్యలు తప్పవని ఎస్సై ఎండీ రవూఫ్ హెచ్చరించారు. మంగళవారం మండలంలోని మహంతీపూర్‌లో పౌరహక్కుల దినాన్ని పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామస్తులకు చట్టాల గురించి వివరించారు. నేరాలకు దూరంగా ఉండాలన్నారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం గురించి ప్రతి ఒక్కరికి అవగాహన ఉండాలన్నారు

మైసమ్మతల్లీ చల్లంగ చూడు..



బోనమెత్తిన మహిళలు

పెద్దేముల్: మైసమ్మ తల్లి ఊరువాడ చల్లంగా చూడాలంటూ భక్తులు బోనమెత్తారు. మంగళవారం పెద్దేముల్ గ్రామాల్లో అమ్మవార్లకు భక్తిశ్రద్ధలతో ఆలయాల వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి, సాయంత్రం మహిళలు బోనాలతో ఆలయాలకు ఊరేగింపు బయలుదేరి నైవేద్యం సమర్పించారు. శివసత్తుల పూనకాలు డప్పుల వాయిద్యాల మధ్య పోతురాజుల విన్యాసాలు ఆకట్టుకున్నాయి. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు.

పూడూరులో..

పూడూరు: మండల పరిధిలోని పలు గ్రామాల్లో బోనాల ఉత్సవాలు ఘనంగా జరిగాయి. మంగళవారం పూడూరు, చన్గోముల్, కెరవెళ్లి గ్రామాల్లో పోతురాజుల విన్యాసాలతో మహిళలు బోనాలు గ్రామాల్లోని వీధుల గుండా ఊరేగించారు. అనంతరం అమ్మవారికి నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



తాండూరు: ఉత్సవంలో స్వప్నపరిమళ్

తుల్జాభవాని దేవాలయంలో..

తాండూరు: మున్సిపల్ పరిధిలోని ఇందిరమ్మకాలనీలో వెలసిన తుల్జాభవాని దేవాలయంలో ఆషాఢ మాసం బోనాల జాతర నిర్వహించారు. ఈ సందర్భంగా కాలనీ వాసులు దేవాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం బోనాలతో వచ్చి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. ఈ ఉత్సవాల్లో మున్సిపల్ చైర్‌పర్సన్ స్వప్నపరిమళ్, కౌన్సిలర్ వెంకన్నగౌడ్‌లు అమ్మవారిని దర్శించుకున్నారు.

రోడ్లు బాగు చేయండి



డీఈకి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

అనంతగిరి: ఇటీవల కురిసిన వర్షాలకు వికారాబాద్ రోడ్లు పూర్తిగా దెబ్బతిన్నాయని, వెంటనే మరమ్మతులు చేయాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం ఆర్అండ్‌బీ డీఈ శ్రీధర్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఏ రోడ్డు చూసిన గుంతలే దర్శనమిస్తున్నాయన్నారు. కొత్తగడి బంగారు మైసమ్మ సమీపంలో రోడ్డుపూర్తిగా బురదమయంగా మారి వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారని ఆరోపించారు. మదన్‌పల్లి రోడ్డు అధ్వానంగా మారిందన్నారు. మొరంగపల్లి–వెల్చాల్ వద్ద మధ్యలో రోడ్డు తవ్వి వదిలి పెట్టారని చెప్పారు. ఇప్పటికైనా అధికారులు వెంటనే మర్మమతులు చేయాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ శ్రీధర్‌రెడ్డి, జిల్లా కోశాధికారి సతీష్, కార్యదర్శి శ్రీకాంత్, రాజేందర్‌రెడ్డి, పట్టణ ఉపాధ్యక్షుడు అమర్, పలువురు యువ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కంపెనీ భూములను కాపాడండి

తహసీల్దార్‌ను కోరిన సీసీఐ ప్రతినిధులు

తాండూరు రూరల్: మండల పరిధిలోని కరన్‌కోట్ గ్రామశివారులో ఉన్న సిమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సిసిఐ) భూములను కాపాడాలని తాండూరు తహసీల్దార్‌ను సీసీఐ ఫ్యాక్టరీ ప్రతినిధులు కోరారు. తహసీల్దార్ తారాసింగ్‌ను కంపెనీ హెచ్ఆర్ మేనేజర్ అమిత్‌రంజన్ బృందం మంగళ వారం కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వం 1977–78 లో సీసీఐకి 1600 ఎకరాల భూమిని ప్రభుత్వం కేటాయించిందన్నారు. ప్రస్తుతం బెల్కటూర్ , చెన్‌గేస్‌పూర్, చంద్రవంచ, కరన్‌కోట్ గ్రామాల మీదుగా సిమెంట్ ఫ్యాక్టరీకి రైల్వేట్రాక్ ఉందన్నారు. రైల్వేట్రాక్ పక్కన మరో ట్రాక్ నిర్మిస్తున్నామని చెప్పారు. సిమెంట్ ఫ్యాక్టరీకి సంబంధించిన భూములు ఇప్పటికీ కొందరి రైతుల పేర్లపై ఉన్నాయన్నారు. కావున, రైతుల నుంచి కంపెనీ పేరుమీదకు భూములు రిజిస్ట్రేషన్ చేయాలని కోరారు. మీసేవాలో స్లాట్‌బుక్ చేసుకొని రావాలని కంపెనీ ప్రతినిధులకు తహసీల్దార్ సూచించారు.

4న రక్తదాన శిబిరం

కొడంగల్ : ఆగస్టు 4న ఉ.10 గంటల నుంచి స్థానిక ప్రభుత్వాసుపత్రిలో రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్లు యువసేన ఫ్రెండ్స్ అసోసియేషన్ సభ్యులు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 18 ఏళ్ల నుంచి 60 ఏండ్ల లోపు వారు రక్తదానం చేయవచ్చన్నారు. స్నేహితుల దినోత్సవం పురస్కరించుకొని రక్తదాన శిబిరం ఏర్పాటు చేసినట్లు చెప్పారు. రక్తదానం చేసి మరోకరికి ప్రాణదానం చేయాలని యువసేన ఫ్రెండ్స్ కోరారు.

నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలి

ప్రిన్సిపాల్ ప్రశాంత్‌కుమార్

తాండూరు టౌన్ : విద్యార్థులు చిన్ననాటి నుంచే నాయకత్వ లక్షణాలను పెంపొందించుకోవాలని కృష్ణవేణి కాన్సెప్ట్ స్కూల్ ప్రిన్సిపాల్ ప్రశాంత్ కుమార్ అన్నారు. మంగళవారం పాఠశాలలో నూతన కేబినెట్ ప్రమాణ స్వీకారోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నాయకత్వమనేది ఒకరి దగ్గరి నుంచి లాక్కుంటే వచ్చేది కాదని, ఇతరులను ప్రభావితం చేసేదిగా ఉండాలన్నారు. అంకితభావం, క్రమశిక్షణ కలిగి ముందు వరుసలో నడిచేవాడే నాయకుడని తెలిపారు. ఇందులో భాగంగా స్కూల్ హెడ్‌బాయ్ సంజయ్, హెడ్‌గర్ల్ అమూల్యతో పాటు, సహాయకులు, క్రీడలు, సాంస్కృతిక, క్రమశిక్షణ తదితర విభాగాలకు నాయకులను ఎన్నుకున్నామన్నారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్లు వెంకటేశం, సతీష్ పాల్గొన్నారు.



ప్రమాణస్వీకారోత్సవంలో విద్యార్థులు

ఉద్యోగికి సన్మానం



రమేష్‌ను సన్మానిస్తున్న అధికారులు, స్థానికులు

కుల్కచర్ల: తెలంగాణ గ్రామీణ బ్యాంక్ క్యాషియర్‌గా విధులు నిర్వహిస్తున్న రమేష్ పదోన్నతిలో భాగంగా ఖమ్మం జిల్లాకు బదిలీ అయ్యారు. మంగళవారం బ్యాంకు సిబ్బంది, స్థానిక సీఎస్పీ కేంద్రం నిర్వాహకులు ఆయనను ఘనంగా సన్మానించారు. మేనేజర్ సతీష్ మాట్లాడుతూ.. ఉద్యోగులకు బదిలీలు సర్వ సాధారణమని, ఎక్కడికెళ్లినా అత్యుత్తమ సేవలు అందించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో బ్యాంకు సిబ్బంది సురేష్, మీనా పాల్గొన్నారు.

కేసులు నమోదు చేస్తాం

బషీరాబాద్: ఆర్టీఏ నిబంధనలు పాటించని డ్రైవర్లపై కేసులు నమోదు చేస్తామని బషీరాబాద్ ఎస్ఐ హెచ్చరించారు. మంగళవారం బషీరాబాద్ రైల్వేస్టేషన్ వద్ద ఆటో, జీపు డ్రైవర్లకు కౌన్సిలింగ్ నిర్వహించారు. పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకోవద్దని సూచించారు. ప్రతి డ్రైవర్ ఖాకీ షర్టు వేసుకోవాలని, వాహనాలకు తప్పనిసరిగా ఇన్సూరెన్స్ చేయించుకోవాలని చెప్పారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తత

షాబాద్: వర్షాకాలం వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని షాబాద్ వైద్యాధికారి డాక్టర్ తబసుం మెహజా అన్నారు. డాక్టర్ శ్రీనివాస్ బదిలీపై వెళ్లడంతో కొందుర్గు డాక్టర్ తబసుం మెహర్‌జా షాబాద్ పీహెచ్‌సీకి బదిలీపై వచ్చారు. ఆమె మాట్లాడుతూ.. ప్రజలకు అందుబాటులో ఉంటామన్నారు.

ముందస్తు అరెస్టులు సరికాదు



బంట్వారం పోలీస్‌స్టేషన్‌లో జీపీ వర్కర్లు



కోట్‌పల్లి ఠాణాలో జీపీవర్కర్లు, ఆశవర్కర్లు

జీపీవర్కర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు బాల్‌రాజ్

బంట్వారం: గ్రామ పంచాయతీ కార్మికులు, ఆశవర్కర్లు ఇతర కాంట్రాక్టు ఉద్యోగులు హైదరాబాద్‌లో నిర్వహించే ధర్నాకు వెళ్తుండగా మంగళవారం బంట్వారం, కోట్‌పల్లి పోలీసులు ముందస్తుగా పలువురిని అరెస్టు చేసి ఠాణాకు తరలించారు. ఈ సందర్భంగా జీపీ వర్కర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు బాల్‌రాజ్ మాట్లాడారు. పోలీసుల అక్రమ అరెస్టులతో తమ ఉద్యమం ఆగదన్నారు. సమస్యల పరిష్కారం కోసం మరింతగా ముందుకు వెళ్తామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం జీపీ వర్కర్లకు ఇచ్చిన హామీలు అమలు చేయాలన్నారు. నగరంలోని ఇందిరాపార్కు వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో జరగనున్న ధర్నాకు వెళ్తుండగా పోలీసులు తమను అక్రమ అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించడం సరికాదన్నారు. ప్రభుత్వం తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలన్నారు. లేనిచో పెద్దఎత్తున ఎక్కడికక్కడ ధర్నాలు చేపడుతామని హెచ్చరించారు.

పండ్ల మొక్కలు నాటాలి

కుల్కచర్ల: ప్రతి ఒక్కరూ ఇంటి పరిసరాలు, పొలాల దగ్గర తప్పనిసరిగా పండ్ల మొక్కలు నాటాలని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఆంజనేయులు అన్నారు. మంగళవారం మండలంలోని ముజాహిద్‌పూర్ గ్రామంలో పంచాయతీ కార్యదర్శి సంతోష్ ఆధ్వర్యంలో పండ్ల మొక్కలను గ్రామస్తులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మొక్కలు నాటడాన్ని బాధ్యతగా భావించాలని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వన మహోత్సవం ద్వారా రాష్ట్రాన్ని హరితమయం చేయాలని కృషి చేస్తోందన్నారు. కార్యక్రమంలో చంద్రభూపాల్‌రావు, వేముల రాములు, చంద్రయ్య, షర్ఫొద్దీన్, యాదయ్య పాల్గొన్నారు.



పండ్ల మొక్కలు పంపిణీ చేస్తున్న సంతోష్, ఆంజనేయులు

ముసురువాన.. దండగేనా?



బొంరాస్‌పేట: వెలవెలబోతున్న రేగడిమైలారం పటేల్ చెరువు

- నిండని చెరువులు, కుంటలు
- నిరాశ నింపుతున్న కాకర్‌వాణి ప్రాజెక్టు, బురాన్‌పూర్ చిన్నవాగు ప్రాజెక్టు
- అలుగు పారని కాగ్నావాగు

బొంరాస్‌పేట: వరుస వర్షాలతో వాగులు, వంకలు పారుతూ చెరువులు, కుంటలు నిండుతుంటే.. మండలంలోని కుంటలు, చెరువుల్లోకి వర్షం నీరు రాలేదు. ఉమ్మడి మండలంలో 14 నోటిఫైడ్ చెరువులు, 30 చిన్నపాటి చెరువులు, కుంటలు ఉన్నాయి. ఈ సారి వర్షాలు సకాలంలో కురుస్తున్నా సరైన మోతాదులో వర్షం కురవక వాగులు, వంకలు మత్తడి దూకడం లేదు. దీంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. ప్రస్తుతం కలుపుతీత పనులు, వరినాట్ల పనులకే సరిపోయినట్లు ఉంది. ఇలాగే కొనసాగితే సాగునీరు అందదనే ఆందోళనలో మండల రైతులు ఉన్నారు.

నిరుడు నిండుగా.. ఈ సారి దండుగా..

చెరువులు, కుంటలు నిరుడు ఇదే రోజుల్లో (జూలై చివరి వారం నాటికి) ఉమ్మడి బొంరాస్‌పేట మండలంలోని ఏర్పుమళ్ల కాకర్‌వాణి, బురాన్‌పూర్ చిన్నవాగు ప్రాజెక్టులు, నోటిఫైడ్ చెరువులు, కుంటలు నిండి అలుగులు పారాయి. బొంరాస్‌పేట, దుద్యాల చెరువులు నిండుకుండలా మారి జోరుగా అలుగులు దూకాయి. బొంరాస్‌పేట చెరువు అలుగు రాకపోకలకు అంతరాయం కలిగించిన పరిస్థితులు ఎదురయ్యాయి. రెవెన్యూ, పోలీసు అధికారులు పర్యవేక్షించి ప్రజలను అప్రమత్తం చేశారు. భారీ వర్షంతో తుంకిమెట్ల కాగ్నావాగు సైతం నిండుగా పారి, తాండూరు వాగు నుంచి కృష్ణానదిలో కలిశాయి. చేపలవేట జోరుగా సాగింది. ఈ సారి ప్రస్తుతం కలుపుతీత పనులకు, కరిగెట నాట్ల కు వానలు సరిపోతున్నాయి. వర్షాకాలం సగభాగం పూర్తయినా సాగునీటి వనరులైన చెరువులు కుంట లు నిండక అన్నదాతలో అయోమయ పరిస్థితి నెలకొంది.